క్లుప్తంగా

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మె



మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): దేశవ్యాప్తంగా జూలై 9వ తేదీన చేపట్టే సార్వత్రిక సమ్మెను లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు స్పష్టం చేశారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణతో కలిసి మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక విధానాలపై జరిపే పోరాటంలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 8 గంటల పని విధానం, 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించే వరకు పోరాటం ఆగదన్నారు. నాయకులు సీహెచ్‌సాయిబాబా, ఆర్.నరసింహులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ డీఈఈ సేవలు ప్రశంసనీయం



ప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు (అర్బన్): ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సాధారణమని ఆర్‌అండ్‌బీ రిటైర్డ్ ఎస్‌ఈ జయరామిరెడ్డి, ప్రస్తుత ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వర రెడ్డి, నంద్యాల ఈఈ శ్రీధర్ రెడ్డి అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఆర్‌అండ్‌బీ డీఈఈ ప్రసాద్ రెడ్డి పదవీ విరమణ సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రసాద్ రెడ్డి సేవలను ప్రశంసించారు. ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. సహోద్యోగులు, అధికారుల సహకారంతో తన విధులను సమర్థవంతంగా నిర్వహించగలిగానన్నారు. చిత్తూరు ఎస్‌ఈ సురేష్ బాబు, ఈఈలు సిద్ధారెడ్డి, శంకర్‌రెడ్డి, సుధాకర్, కర్నూలు ఈఈ సునీల్ రెడ్డి, పద్మనాభ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పిస్తా హౌస్ నిర్వాహకుడిపై దాడి

కర్నూలు: కర్నూలు శివారులోని గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో జాతీయ రహదారి పక్కనున్న పిస్తా హౌస్ హోటల్ యజమాని కుమారుడు ప్రియతమ్‌పై దాడి జరిగింది. శరీన్‌నగర్‌కు చెందిన రౌడీషీటర్ ఇమ్రాన్ సోదరుడు ఫిరోజ్, జాకీర్, రషీద్ తదితరులు మంగళవారం రాత్రి ఆటోలో పిస్తా హౌస్‌కు వెళ్లి ప్రధాన ద్వారానికి అడ్డంగా ఆటోను నిలిపారు. గేటుకు అడ్డంగా ఆటో నిలపవద్దని వాచ్‌మన్ చెప్పడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. హోటల్ యజమాని కుమారుడు ప్రియతమ్ జోక్యం చేసుకోవడంతో అక్కడున్న కంప్యూటర్ తీసుకుని అతని తలపై బాది దాడి చేశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

పనుల్లో పురోగతి సాధించాలి

- డ్వామా పీడీ వెంకటరమణయ్య



మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరమణయ్య

కల్లూరు: ఉపాధి హామీ పనుల్లో పురోగతి సాధించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య సూచించారు. బుధవారం ఆయన కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఫాంపాండ్స్, హార్టికల్చర్, వేతన దారులకు కల్పిస్తున్న పని దినాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పనులు కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నాగేశ్వరచలరెడ్డి, ఏపీఓ రమాదేవి, ఈసీ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

యాగంటి వేలాలు వాయిదా

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో రుద్రాక్ష మాలలు, రక్షాధారణలు, కరుంగలి మాలలు, రాగికడియాలు విక్రయించుకునేందుకు బుధవారం నిర్వహించాల్సిన బహిరంగ వేలాలను వాయిదా వేసినట్లు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి తెలిపారు. అనివార్య కారణాలతో వాయిదా పడ్డాయని, మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అవుకు: మండలంలోని రామాపురం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడని ఎస్‌ఐ రాజారెడ్డి బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చాకలి బాలయ్య (51) బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా తాడిపత్రి నుంచి వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొనడంతో కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయమై మృతి చెందాడు. భార్య చాకలి హుసేనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

సమ్మె విరమించాలంటూ అధికారుల ఒత్తిళ్లు

- టెంట్ ఎత్తేయాలంటూ హెచ్చరికలు
- న్యాయం జరిగే వరకు కొనసాగిస్తామని కార్మికుల వెల్లడి
- పెట్రోల్ బాటిళ్లతో మున్సిపల్ కార్మికుల నిరసన



పెట్రోల్ బాటిళ్లలో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కర్నూలు (టౌన్): మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ 57 రోజులుగా చేస్తున్న సమ్మె ఉద్రిక్తంగా మారుతోంది. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ విధులను బహిష్కరించి వివిధ రూపాల్లో నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సమ్మె విరమించాలని మున్సిపల్ ఇంజినీర్లను ఒత్తిడి చేశారు. టెంట్ ఎత్తి వేయాలంటూ ఆదేశించారు. లేకుంటే పోలీసులతో కలిసి బలవంతంగా తొలగిస్తామని బెదిరించారు. దీంతో కార్మిక సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, మనోహర్ మాట్లాడుతూ.. తమకు హామీ ఇస్తే సమ్మెను విరమిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి లిఖిత పూర్వకంగా హామీ ఇస్తే తాము సమ్మె విరమిస్తామని చెబుతున్నా.. పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. బలవంతంగా సమ్మెను విరమించాలని చూస్తే తాము కుటుంబాలతో కలిసి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేతనాలు పెంచాలన్న డిమాండ్‌తో నెలన్నర రోజులుగా సమ్మె చేస్తున్నా మున్సిపల్ అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు. సీనియారిటీ ప్రాతిపదికన వేతనాలు అమలు చేయాలని, అలాగే హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షలు, అంగవైకల్యానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె విరమించే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు.

సమ్మె ప్రభావంతో ప్రజలకు తప్పని ఇబ్బందులు

నగరపాలక సంస్థ ఎదుట 57 రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేపట్టడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సమ్మెలో వీధిలైట్ల కార్మికులు, వాటర్ వర్క్స్ సిబ్బంది, పార్కుల నిర్వహణ కార్మికులు ఉన్నారు. దీంతో కర్నూలు నగరంలో వీధి లైట్లు వెలగక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ వర్క్స్ సిబ్బంది లేకపోవడంతో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు వస్తున్నాయి. అనేక కాలనీలకు తాగునీరు అందడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

నాణ్యత పరీక్షలను వెరిటాస్‌కు అప్పగించొద్దు




ధర్నా చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టర్లు

కర్నూలు (టౌన్): నాణ్యతను పరీక్షించే బాధ్యతను ఎక్కడో ఉన్న బ్యూరో వెరిటాస్ సంస్థకు అప్పగించాలన్న నిర్ణయాన్ని మున్సిపల్ అధికారులు విరమించుకోవాలని కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్లు రంగయ్య, ముక్తార్ డిమాండ్ చేశారు. స్థానికంగా ఉన్న విజిలెన్స్ అధికారులతో పరీక్షిస్తే సరిపోతుందని చెప్పారు. ఈ మేరకు మంగళవారం నగర పాలక సంస్థ ఎదుట మున్సిపల్ కాంట్రాక్టర్లు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ.. మున్సిపల్ అధికారులు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. ఇప్పటికే రూ.కోటి బిల్లులు రావాల్సి ఉందని వాటి కోసం రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోందన్నారు. డ్రాయింగ్ బ్రాంచ్ నుంచి అకౌంట్స్ సెక్షన్ వరకు అక్కడి నుంచి కమిషనర్ సంతకం అయ్యే వరకు చాలా సమయం పడుతుందని వాపోయారు. క్వాలిటీపై స్థానిక నిపుణలకు బాధ్యతలు అప్పగిస్తే సరిపోతుందన్నారు. బ్యూరో వెరిటాస్ సంస్థకు రాష్ట్రంలో విశాఖపట్నం, విజయవాడ ప్రాంతాల్లో మాత్రమే బ్రాంచ్‌లు ఉన్నాయని, ఆ సంస్థ ప్రతినిధులు కర్నూలుకు ఎప్పుడు రావాలి? ఎప్పుడు నివేదిక ఇవ్వాలి? బిల్లులు మంజూరు చేస్తారు? అని ప్రశ్నించారు. ఇప్పటికే మూడు రోజులుగా కర్నూలు నగరంలో పనులు నిలిపివేశామని, ఇదే నిర్ణయం అమలు చేయాలనుకుంటే తాము పనులు చేయలేమని తేల్చి చెప్పారు. మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ధర్నాలో మున్సిపల్ కాంట్రాక్టర్లు వేణుగోపాల్, లతీఫ్, ఇలియాస్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి నారికేళార్చన





సామూహిక కుంకుమార్చనలో మహిళలు(ఇన్‌సెట్) నారికేళాల అలంకరణలో వారాహి అమ్మవారు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో నిర్వహిస్తున్న వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాహి అమ్మవారికి అభిషేకం, నారికేళార్చన నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. సామూహిక కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి భక్తులనుద్దేశించి మాట్లాడారు. లలితా పీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

డప్పు కళాకారులకు పింఛను ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎండీ ఆనంద్‌బాబు

కర్నూలు(సెంట్రల్): డప్పు కళాకారులకు నెలకు రూ.7 వేల పింఛను ఇవ్వాలని ఏపీ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డప్పు కళాకారుల కోసం తాను ఉన్నానంటూ డప్పు కొట్టారని.. డప్పు కొడితే తమ కడుపులు నిండవని, పింఛను పెంచితేనే లాభపడతామని చెప్పారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏపీ డప్పు కళాకారుల జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డప్పు కళాకారులకు 45 ఏళ్లకే పెన్షన్ ఇవ్వాలన్నారు. ఇప్పటికే ఎంతో మంది పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారందరికీ పింఛను మంజూరు చేయాలన్నారు. ఇందుకోసం జూలై 3 నుంచి 9వ తేదీ వరకు సచివాలయాల ఎదుట, జూలై 9 నుంచి 20వ తేదీ వరకు మండల కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీకేఎస్ అధ్యక్షుడు మద్దిలేటి, కార్యదర్శి కరుణాకర్ పాల్గొన్నారు.

6న తొలి ఏకాదశి వేడుకలు

కర్నూలు కల్చరల్: ఆషాఢ మాసం తొలి ఏకాదశి పురస్కరించుకొని ఈనెల 6వ తేదీన ఓల్డ్‌సిటీలోని షిరిడీ సాయినాథుని ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు మహాబలేష్ తెలిపారు. సాయిబాబా పాండురంగని అవతారమని భక్తుల విశ్వాసమని పేర్కొన్నారు. గురువారం పాండురంగ విటలుని రూపంలో సాయిబాబా భక్తులకు దర్శనమిస్తారని వెల్లడించారు. భక్తులందరూ స్వామివారిని దర్శించుకొని సాయినాథుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

4న శాకంబరీ పూజలు

కర్నూలు కల్చరల్: ఆషాఢ మాసం శుద్ధ నవమి శుక్రవారం పురస్కరించుకొని ఈ నెల 4న సప్తగిరి నగర్ చౌడేశ్వరీ దేవి ఆలయంలో శాకంబరీ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 10 గంటలకు కైలాసగిరి ఆలయం నుంచి అమ్మవారి సన్నిధికి బోనాలతో ఊరేగింపు, అమ్మవారికి పంచామృతాభిషేకం, శాకంబరీ అలంకారం, లలితా సహస్రనామ కుంకుమార్చన, కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

ఉద్యాన వనాల అభివృద్ధికి చర్యలు

కర్నూలు (టౌన్): నగరంలో ఉద్యాన వనాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక 16వ వార్డు బుధవారపేటలోని దామోదరం సంజీవయ్య మైదానంలో నడకబాట, ఓపెన్ జిమ్, కిడ్స్ ప్లే, పచ్చదనం, సుందరీకరణ పనులను మంత్రి ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. బుధవారపేటలో జనాభా ఎక్కువగా ఉన్నా సేద తీరేందుకు ఆహ్లాదకరమైన ప్రదేశం లేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని చేపల గుంత మైదానంలో రూ.31.4 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేశామన్నారు. నగర పరిధిలో అన్ని పార్కుల అభివృద్ధికి కృషి చేస్తామని, ప్రాధాన్యత క్రమంలో ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. పచ్చదనం పెంపునకు 4,800 మొక్కలు నాటించినట్లు చెప్పారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, డీఈఈ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

శ్వాస నాళానికి స్టెంట్‌తో అరుదైన చికిత్స



ఆపరేషన్ చేయించుకున్న వృద్ధురాలితో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): మూసుకుపోయిన శ్వాసనాళానికి స్టెంట్‌తో అరుదైన చికిత్స చేసినట్లు ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ యశోవర్ధన్ మంగిశెట్టి, పల్మనాలజిస్టు డాక్టర్ చలమయ్య చెప్పారు. రాయలసీమలోనే తొలిసారిగా 75 ఏళ్ల వృద్ధురాలికి ఈ చికిత్స కర్నూలులోని కిమ్స్‌లో చేశామన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీకి చెందిన వై.మహాలక్ష్మి(75) అన్నవాహిక క్యాన్సర్‌తో బాధపడుతున్నారన్నారు. దానికితోడు ఆమె శ్వాసనాళం 75 శాతానికి పైగా మూసుకుపోవడంతో ఊపిరి తీసుకోలేని పరిస్థితికి చేరుకున్నట్లు చెప్పారు. ఆమెకు రిజిడ్ బ్రాంకోస్కోపి ద్వారా మెటాలిక్ స్టెంట్‌ను సీ ఆర్మ్ సహాయంతో అమర్చామని తెలిపారు. దీంతో ఆమె శ్వాసనాళం తెరుచుకుని శ్వాస ఆడటం మొదలైందన్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి బాగవ్వడంతో 27వ తేదిన ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశామన్నారు. ఇలాంటి చికిత్సలు హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉంటాయన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సంచార వైద్య చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు



పోస్టర్లను విడుదల చేస్తున్న డా.రఘు

ఓర్వకల్లు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సంచార వైద్య చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి సూచించారు. బుధవారం ఉప్పలపాడు గ్రామంలో నిర్వహించిన సంచార వైద్య చికిత్స కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. గ్రామ ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో వర్షపునీరు నిల్వ ఉండకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించేలా ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారి నాగరాజు, సామాజిక ఆరోగ్య అధికారిణి జానకి, ఆశా వర్కర్ వరలక్ష్మి, ప్రాజెక్టనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

కేసు నమోదు

బనగానపల్లె: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని నందవరం గ్రామానికి చెందిన కొమ్ముశేఖర్, కొమ్ము మహేష్‌పై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు.ఎస్‌ఐ వివరాల మేరకు కొమ్ము శేఖర్ తాగుడుకు బానిసై తన భార్య రమాదేవిపై అనుమానంతో మానసికంగా వేదింపులకు గురి చేస్తున్నాడు. ఈ విషయంలో భార్య భర్తలు గత రెండు రోజుల క్రితం గొడవపడుతుండగా రమాదేవి తల్లి నారాయణమ్మ అడ్డు వచ్చింది. దీంతో కొమ్ముశేఖర్, కొమ్ము మహేష్.. నారాయణమ్మను కొట్టి చంపుతానని బెదిరించారు. నారాయణమ్మ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రేపు ‘చలో పోతిరెడ్డిపాడు’

ఆత్మకూరు: సాగునీరు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 4న చలో పోతిరెడ్డిపాడు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుతోట రాజశేఖర్ తెలిపారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురిసిన వర్షాలకు శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరిందన్నారు. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టులో 875 అడుగుల నీరు చేరిందని, ఇంత నీరు చేరినప్పటికీ రాయలసీమ ప్రాంత రైతులకు సాగునీరు విడుదల చేయకపోవడం తగదన్నారు. గతంలో 850 అడుగుల నీటి మట్టం ఉన్నప్పుడు కూడా సాగునీటిని విడుదల చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పటికే కర్నూలు, కడప జిల్లాల్లో కరువు పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ముందస్తు వర్షాలకు ఆత్మకూరు డివిజన్‌లోని కొత్తపాడు, ఆత్మకూరు, వెలుగోడుతో పాటు బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో వేలాది ఎకరాల్లో సాగు చేసుకున్న మొక్కజొన్న, పత్తి, కంది పైర్లు వాడిపోతున్నాయన్నారు. తెలుగుగంగ, తుంగభద్ర ప్రాజెక్టులతోపాటు పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మాబాషా, వీరన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి గణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

బీసీ హాస్టళ్లలో మెనూ అమలులో విఫలం

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందడం లేదని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాగంటి రాజు, సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు మహబూబ్‌బాషా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు బుధవారం కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. వసతి గృహ సంక్షేమాధికారులు తమ స్వార్థంతో మెనూ అమలు చేయ డం లేదన్నారు. భోజనాల్లో నాణ్యత లోపించడం వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఆయా వసతి గృహాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నాయకులు మధు, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

6న క్రికెట్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో ఉన్న క్రికెట్ నెట్స్‌లో ఈనెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు అండర్–14 విభాగంలో బాలుర క్రికెట్ జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె.దేవేంద్ర గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2011 సంవత్సరం సెప్టెంబర్ నెల 1 తేదీ తరువాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఒరిజినల్ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు వెంట తీసుకు రావాలని సూచించారు. ప్రతిభ కనబరచి ఎంపికైన క్రీడాకారులకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సౌత్‌జోన్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంటులో పాల్గొనే అవకాశం ఉంటుందని వెల్లడించారు.

మద్యం విక్రేత అరెస్టు

రుద్రవరం: మండలంలోని ఆర్.నాగులవరం గ్రామానికి చెందిన దస్తగిరి అనే మద్యం విక్రేతను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్‌రఫి తెలిపారు. గత కొంత కాలంగా ఆ వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి వద్దే మద్యం విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకొని దాడి చేయగా 16 మద్యం బాటిళ్లతో పట్టుబడినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదనపు భూ సేకరణకు క్లెయిమ్స్ స్వీకరణ



రైతుల నుంచి స్వీకరించిన క్లెయిమ్స్ పరిశీలిస్తున్న ఆర్డీఓ నాగజ్యోతి

పాములపాడు: నేషనల్ హైవే 340సీ నిర్మాణ పనులకు సంబంధించి అదనపు భూ సేకరణ నిమిత్తం రైతుల నుంచి క్లెయిమ్స్‌ను ఆర్డీఓ నాగజ్యోతి స్వీకరించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ మాట్లాడుతూ జూటూరు గ్రామం వద్ద జరుగున్న హైవే పనులకు 3.805 ఎకరాలు అవసరముందన్నారు. భూమి యజమానులు 38 మందికి అవార్డు కాపీలను అందించామన్నారు. వీరంతా భూముల ధ్రువ పత్రాలు, ఆధార్ కార్డు, పొలం పాసుబుక్కులతోపాటు 11 రకాల పత్రాలను అందించాలన్నారు. రైతుల నుంచి క్లెయిమ్స్ పత్రాలు స్వీకరించినట్లు వివరించారు. అలాగే జూపాడుబంగ్లా మండలంలో 1.07 ఎకరాల భూమి సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్రమ్మ, ఆర్ఐ ఖాజాబీ, మండల సర్వేయర్ భాస్కర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిపై విచారణ



విద్యార్థుల తల్లిదండ్రులను విచారిస్తున్న ఎంఈఓ, ఎస్ఐ

బేతంచెర్ల: మండలపరిధిలోని కొమ్మురి కొట్టాల ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు నాగలక్ష్మమ్మను విద్యార్థుల తల్లి దండ్రుల సమక్షంలో ఎంఈఓ సోమశేఖర్, ఎస్ఐ రమేష్ బాబు బుధవారం విచారించారు. 37 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో విద్యార్థులకు నాగలక్ష్మమ్మ అరకొరగా భోజనం పెట్టడమే కాకుండా పాఠశాలలో తాను చెప్పిన పని చేయకపోతే తిట్టడం లాంటి పనులు చేస్తోంది. ఎందుకిలా చేస్తున్నావని అడగటానికి వెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రులతో గొడవ పడుతోంది. దీంతో తల్లి దండ్రులు రెండు రోజులుగా విద్యార్థులను పాఠశాలకు పంపకుండా మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ సోమశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు బుధవారం ఎస్ఐ రమేష్ బాబు, ఎంఈఓ వెళ్లి విద్యార్థులను, తల్లిదండ్రులను విచారించారు. కాగా, విచారణకు కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు మాత్రమే వచ్చారని, గురువారం అందరితో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని ఎంఈఓ వెల్లడించారు.

ఐఎఫ్‌టీయూలో చేరిక

కర్నూలు(సెంట్రల్): టీయూసీఐ కార్మిక సంఘం నుంచి ఐఎఫ్‌టీయూలోకి తిరుపాల్‌తో సహా 20 మంది కార్మికులు చేరారు. ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, వెంకప్ప వారికి శాలువాలు కప్పి ఆహ్వానించారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసే ఐఎఫ్‌టీయూలోకి ఒకేసారి 20 మంది చేరడం అభినందనీయమన్నారు. జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని వారు కోరారు. నాయకులు మనోహర్,రవి, బాబు, విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



విజేంద్ర (ఫైల్)

ఆలూరు రూరల్: కురువల్లి గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి మూడు రోజులుగా కనిపించడం లేదు. ఎస్ఐ మహబూబ్ బాషా తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన హనుమంతప్ప,అంపమ్మ దంపతుల కుమారుడు విజేంద్ర గత నెల 29న ఉదయం పొలానికి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి దండ్రులు పలు చోట్ల విచారించినా ఆచూకీ లభ్యం కాలేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కే సు నమోదు చేసి దర్యాప్తు చేస్తుట్లు ఎస్ఐ వివరించారు. బాలుడి ఆచూకి తెలిసిన వారు ఆలూరు ఎస్ఐ ఫోన్ నంబర్ 9121101158కు సమాచారం ఇవ్వాలని కోరారు.

28 నుంచి సీపీఐ జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న పి.రామచంద్రయ్య

కర్నూలు(సెంట్రల్): జూలై 28, 29, 30 తేదీల్లో నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 24వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షతన ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా మహాసభలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు పార్టీ కార్యకర్తలు భాగస్వామ్యం కావాలన్నారు. ఈ మహాసభల్లో సాగునీటి ప్రాజెక్టులు, కరువు, ఉపాధి హామీ ఇతర డిమాండ్లపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు చెప్పారు. జిల్లా మహాసభలకు పెద్ద ఎత్తున జన సమీకరణ చేయాలన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే సమావేశంలో మొదటి రోజు భారీ ర్యాలీ ఉంటుందని, రెండో రోజు ప్రతినిధుల సభ, మూడో రోజు ముగింపు సభలు ఉంటాయన్నారు. జిల్లా మాజీ కార్యదర్శి భీమలింగప్ప, లెనిన్ బాబు, అవుల శేఖర్, మునెప్ప, లలితమ్మ, అజయ్ బాబు, నబీ రసూల్, చంద్రశేఖర్, రంగన్న, కారుమంచి, శ్రీరాములు పాల్గొన్నారు.